# 4

# శివుడు

పన్నెండేండ్ల శివుని ఒళ్ళు మసిపట్టిన మట్టికుండ రంగులో మిలమిలా మెరుస్తోంది.

వాడి ఒంటిపై చొక్కాలేదు. నెత్తికి నూనె లేదు. కాళ్ళకు చెప్పులు లేవు. తింటానికి తిండిలేదు- మొలలో పిర్రలు చిరిగిన ఓ పెద్దసైజు నిక్కరుంది.

వాడు ఊరిచివరి తాటితోపులో కాళ్ళు నిక్కించి బాల సైనికునిలా నిలబడి దీక్షగా తాడిచెట్ల వెనుక మెరుస్తూ కనబడే తారురోడ్డువంక చూస్తున్నాడు. పట్టపగలు.... విసురుగా వచ్చిన వడగాలి వాడి దవడలు వాయించి వెళ్ళిపోయింది. గాలికి కనురెప్పలను మిటకరించి- మళ్ళీ తదేకంగా అటే చూస్తున్నాడు.

వాడి జుట్టులోనుండి చెమట ధారగా కణతలపై నుండి కారి... రోడ్డు పై నుండి లారీ యింకా రావట్లేదు.

"ఇంకెప్పుడ్రా వచ్చేదీ లారీ..." అని గొణిగేరెవరో వెనక ఉన్న మందలోంచి తుపుక్కున ఉమ్మేసి మళ్ళీ చుట్టను నోట్లో పెట్టుకుంటూ.

"వస్తది వస్తది-గట్ల తొందరపడ్తె ఎట్లరో. ఏలమంది ఎవ్వారం వందల లారీల తంతు.... అంతా భారీ పనాయె మరి" సర్పంచ్ సత్తెం గొంతు.

శివుడు చూడ్డం మాని వెనక్కి తిరిగి సర్పంచ్ వంక చూశాడు.

అతను నిలబడి వున్నాడు.. చుట్టూ ఊళ్ళోనుంగి కిరాయికోసం వెళ్ళాల్సిన జనం కాపరిచుట్టూ అమాయకపు గొర్రెల్లా కూర్చుని....

"అరేయ్... యిలాగా మీకు మీరు పట్నంపోంగనే ఏమేం చెయ్యాల్నో చెప్తా. మంచిగి నుండ్లి... యిన్నారా-"

"ఆఁ.... చెప్పండి".

"యిప్పుడు లారత్తది గద. రాంగనే ఆ వచ్చినోడు నాకు పైకమిత్తడు. నేను అవి తీస్కోని మీకు మనిషికి రొండ్రూపాలిస్త. ఎంటనే మీరా లారీల ఎక్కాలె. అర్థగంటల మిమ్మల్ని పట్నం తీస్కపోద్దది. పోంగనే ఒక పెద్ద దొడ్లె మిమ్మల్ని దింపుతారు. అప్పటికే అడ మీ లెక్కనే ఎన్నెన్నో ఊర్లల్లకెల్లొచ్చిన జనం వేలమందుంటరు. యిగ మీకందరికి

టిఫిన్లు పెడ్తరు. మీరు మంచిగా కడ్పునిండ తినాలె. తిన్నంక మీకు పట్టుకుంటాన్కి రాతలు రాసిన అట్టలిస్తరు, పట్కోవాలె.''

"వాటిమీద ఏం రాసుంటది పటేలా.''

"ఏం రాసుంటేందిరా-పట్కోమంటే పట్కో గంతే. నడువ్ మంటరు. లైన్ల నడ్వుండ్లి-అండ్లకెళ్ళి ఒకడేదో ఒర్తడు. వాడెట్ల ఒర్తే మీరేమని ఒర్రాల్నో ముందుగానే మీకు చెప్తరు. గట్లనే ఒర్రుండ్లి. ఐపాయే''

"అటెంక''

"మీరు ఊరేగింపుల నడిచినంక ఓ కాడ మైదాన్ల అందరూ కూకోవాలె. ఎవరో మాట్లాడ్తరు. మీరు వినాలె. అప్పుడప్పుడు సప్పట్లు కొట్టాలె. మీటింగై పోయినంక మీకు మల్ల మనిషికి రొండ్రూపాలిస్తరు. తీస్కొని అదే లారెక్కి మనూరు రాండ్రి - ఐపాయే''

"మరి నువ్వస్తవా మాతోటి-'' శివుని ప్రశ్న.

"నే నెందుకురా- నేన్రాను''.

"మరి మమ్మల్ని పంపి నువ్ రానందుకు నీకెన్ని రూపాలిస్తర్''.

"అరే శివా-గవన్నీ నీ కెందుకురా... చెప్పింది చెయ్‌రా బాగుపడ్తవ్'' అని అంటూండగానే.

డ్ డ్ డ్ డ్... డ్.... డ్....డ్-

లారీ చప్పుడు వినబడ్తూ....

అందరూ అటుచూశారు. లారీ దుమ్ము రేపుకుంటూ దూసుకొస్తోంది. వచ్చి వచ్చి ఆగి-

అందులోనుంచి ఓ ఏనుగు గున్నలాంటి మనిషి దిగి - సర్పంచ్ నడిగి తెలుసుకుని చేతిలోని బ్యాగ్‌లోనుంచి ఒక కొత్త రెండ్రూపాయల నోట్ల కట్టను అందించాడు.

వెంటనే - కట్లు తెగి-

సర్పంచ్ ఒక్కో నోటును ఒక్కో మనిషికి యిచ్చి

"ఎక్కుండ్లిరా దబదబ... జల్దీ జల్దీ -''

శివుని చేతికి నోటు అందింది!

నోటువంక పరిశీలనగా చూచి... కారుతున్న చెమటనుచిమ్మి... పరుగు తీశాడు-

పరుగు... పరుగు...

ఎండలో... కాలే భూమిపై బోసి పాదాలతో.... వీచే వడగాలి నడుమ-

ఉరికి ఉరికి-కూలిపోబోతున్న గుడిసెముందాగి.... "అవ్వా.... అవ్వా-'' అని అరిచి....వాకిట్లో ఊగిపోతూ...మొసపోస్తూ-

లోపలినుండి ఓ చీకిపోయిన మనిషి బయటికొచ్చి-

"యింగోవే.... వీటిని తీస్కోని బువ్వ వండు, నేను రాత్రి కొస్త" అని వెనుదిరిగి-

"అరేయ్-ఎట్రా... శివా..."

శివుడు ఆమె మాటలు వినలేదు-పరుగెత్తుతూనే ఉన్నాడు లారీదిక్కు-

అప్పటికే లారీనిండా జనం ఎక్కారు.

వచ్చిన శివున్ని "ఎటు పోయినౌరా లంజాకొడ్క. ఒక దిక్కు ఆలస్యమైతాందంటే.... నడు నడు...."

శివుడు చకచకా ఎక్కాడు.

దుమ్ములోనుండి యికిలిస్తూ కనిపిస్తున్న సర్పంచ్ చేతిలో మిగిలిన రెండ్రూపాయల నోట్ల కట్ట...

శివునికి ఎంతో సంబరంగా వుంది లారీ ప్రయాణం విమాన ప్రయాణంలా. పరిగెత్తుతున్న చెట్లనూ, గుట్టలనూ, గట్లనూ చూస్తున్నాడు.

ఎన్నో రోజుల తర్వాత.... రెండ్రూపాయలు...

వారానికి నాల్గురోజులు పస్తులుండే అవ్వ...తను....

ఇవ్వాల .... అవ్వ బువ్వతింటది-

తనకు "టిఫిని.... టిఫిని....టిఫిని పెడ్తరటక్కడ!"

లోపల ఏదో ఉత్సాహం....

వడగాలికూడా ఎంతో ఆనందంగా తోస్తోంది శివునికి.

★ ★ ★

"దిగుండ్లి.... దిగుండ్లి.... దిగి అగో.... గా మూలకు కూర్చున్నాయ్న దగ్గరకు వెళ్ళండి - పోండి, దబ్బున".

అతను చూపించినచోట ఒక వ్యక్తి చిన్న బల్లపై కూర్చుని.... అతని ప్రక్క గోడకు ఏవేవో అట్టలు - వాటిపై ఎన్నెన్నో రాతలు...

"వాటిని పట్టుకుంటే బాగుండు".

నడుస్తున్నాడు శివుడు.

అక్కడే యింకో మనిషి ప్రక్కన గిన్నె.

దగ్గరికి పోగానే ఒక కాగితంలో గంటెడు వుప్మాను టపుక్కునవేసి- అందించి "దబ్బున తిని ఆడికిపోయి ప్లెకార్డ్ తీస్కోండ్లి"

జనం తలలూపుతూ వుప్మాకాగితం అందుకుని.

శివుని చేతిలో పొట్లం పడింది.... అమృతాన్ని పొందిన రాక్షసునిలా ఆనందంతో పుళ్ళితబ్బిబ్బయి-

తిని....గబగబా తిని....

త్రేన్చి.... వెళ్ళాడు బ్యాడ్జీలు పెడ్తున్న చోటికి క్యూలో.

కుర్చీలో కూర్చున్న మనిషి చటుక్కున క్యూలోని మనిషి చొక్కా జేబునందుకుని గుండుసూదితో బొమ్మ కాగితాన్ని గుచ్చి రాసిన అట్ట కట్టిన కట్టెను చేతికిస్తున్నాడు.

క్యూ వరుసగా కదులుతూ -

శివుని వంతు వచ్చింది.

బ్యాడ్జీల వ్యక్తి.... చటుక్కున ఒంటిపై చొక్కాలేని శివునివంక అసహ్యంగా, ఉగ్రంగా చూచి-కసిగా కాగితాన్ని ఛాతీపైనున్న తోలుపై ఉంచి గుండుసూదితో గుచ్చి-

క్షణంలో పదోవంతు కాలంలో- గుండుసూది చర్మంలో నుండి చొచ్చుకుని దిగి ... "అమ్మా" అని అరిచాడు శివుడు.

రక్తం ఎర్రగా బొటబొటా కారి... శివుని నగ్న వక్షస్థలంపై జాతీయజెండా... తోలుకు గుచ్చబడి....

ఛాతీపై నున్న మూడురంగుల జెండా - రక్తంలో తడుస్తూ-

చేతికి ఓ అట్టనిచ్చి "పోబే" అని మెడబట్టి గెంటేశాడా వ్యక్తి.

గుండెలపై మంట..... మంట.... ప్రాణం పోతున్నట్లుగా బాధ-

నడుస్తున్నాడు శివుడు.

రక్తం కారుతోంది ఛాతీపై నుండి... భరించలేని మంట...

ఎవరో ఏవో నినాదాలు చెబుతున్నారు. వాటికి ప్రతిగా జనం ఏమని అరవాలో అతనే అరచి చూపిస్తున్నాడు.

" పద.. పద.... ఆలస్యమైంది" ఎవడో మెడబట్టి ముందుకు నెడ్తున్నాడు

వెంట వెంటనే క్యూ తయారై-

ఊరేగింపు మొదలైంది.... ఒకరినొకరు తోసుకుంటూ, కుమ్ముకుంటూ.... ఊరేగింపు.... సముద్రంలా ఉరేగింపు.

"ఎరాడికేట్ ఇల్లిటరసీ" - శివుడు తన చేతిలోని అట్టవంక చూచుకున్నాడు.

అదేమిటో అర్థం కాలేదు. చదువురాదు

ప్చ్-ఏమిటో.... నడుస్తున్నాడు కాల్తున్న రోడ్డుపై బోసి పాదాలతో ఛాతిపై గుండుసూది దిగిన చర్మం మండుతూ మూడు రంగుల జండా పూర్తిగా రక్తంతో తడిసిపోయింది.

చేతిలోని అట్టవంక మళ్ళీ దీనంగా చూశాడు. ఏవో అక్షరాలు.... అవేమిటో తనకు తెలియవు.

తెలియని దాని కోసం పోరాటం..... అరుపులు..... కేకలు.... బొబ్బలు.

సాగుతోంది ఊరేగింపు-

ఉప్పెనలా - తుఫానులా...

యీ లోపలే ఎక్కడో 'ఢాం' అని చప్పుడు.

అప్పటిదాకా వెంట నడుస్తున్న పోలీసులు చెల్లాచెదరై-

ఎక్కడి నుండి పుట్టాయో బస్సులో మంటలు.... మంటలు...

మంటలు క్షణాల్లో వ్యాపిస్తూ - యిండ్లు - కాలుతూ -

"మారో.... మారో"

పక్క పక్క - ఎముకలు పగిలేలా... కర్రలు స్వైరవిహారంచేస్తూ-

"డిషం.... డిషం"

తెల్లని పొగ- కళ్ళ మంటలు....

పరుగు.... పరుగు.... ఎవడికి తోచినదిక్కు వాడు. తొక్కుకుంటూ..... తోసుకుంటూ.... అరుచుకుంటూ.

బీభత్సం-

"మారో - ఔర్ మారో"

యింకా తీవ్రత....

కకావికలై జనం రాతిపైపడి చిట్లిన గాజుపలక ముక్కల్లా.

శివుడు ఉరుకుతున్నాడు భయంతో.... ఏటో..ఏటో ఒక దిక్కు

చేతిలో అట్టకట్టె.... గుండెపై గుచ్చుకున్న గుండుసూది.

ఎవరో తోసేశారు.

క్రిందపడి తొక్కుతున్నారు... "అమ్మా, అయ్యో.... బాబూ.... అమ్మా-"

పై నుండి వందలమంది పరుగెత్తున్నారు.... ఒకరి వెంట మరొకరు....

మెల్లగా లేచేందుకు ప్రయత్నిస్తుండగా,

"ఫైర్-"

టిష్యుం..... టిష్యుం...

"అమ్మా......"

కేక.....

శివుని కేక...

దిక్కులు పిక్కటిల్లేలా శివుని కేక-

గుండెలపై మూడు రంగుల జండాను అట్టిపెట్టి ఉంచిన గుండుసూదిని తుపాకి గుండు పెకిలించి లోపలికి దూసుకుపోయి-

కేక గాలిలో గడ్డకట్టి - ఎర్రగా రక్తం కారుతూ

టప్.... టప్.... టప్.... బొట్లు.... బొట్లు..... రక్తపుబొట్లు ధారగా కారి.... మడగు-

★ ★ ★

కూలిపోబోతున్న గుడిసె ముందు-

చీకిపోయిన ముసల్దాని ముంగిట్లో-

కార్లదండు వచ్చి ఆగింది.

ఖరీదైన పెద్దమనిషెవరో శివుడు అమరుడై పోయినందుకు ఆమెను ఓదారుస్తూ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాడు.

ఫోటోగ్రాఫర్లు టకటకా ఫోటోలు తీస్తున్నారు.

ఆమెకదంతా ఏమిటో అర్థం కాలేదు.

అర్థంకాకముందే కార్లూ, కార్లలో ఖరీదైన వ్యక్తులూ వెళ్ళిపోయారు.

ఆమె....

ముడతలు పడ్డ కళ్ళతో-

అప్పుడే వండిన ముతకబియ్యపు అన్నాన్ని - గిన్నెలో ఉన్నదాన్ని శివుని కోసం ఊహిస్తూ -

ఊరి చివర తాటితోపు అవతలి- తారురోడ్డు దిక్కు చూస్తోంది శివుని కోసం.... రాని శివునికోసం.

చూస్తున్న ఆమె కళ్ళలో

వెనుదిరిగి వెళ్తున్న కార్లు రేపిన దుమ్ము గుప్పున పడింది.

ఆమె కళ్ళనిండా..... దుమ్ము.... పూర్తిగా.....

(మన ముఖం వికారమైందే కావచ్చు. కాని మన ముఖాన్ని మనం అద్దంలో చూచుకున్నపుడు ఆనందం కలుగుతుంది. ఎందుకంటే మనం మనదైన నిజాన్నీ, వాస్తవాన్నీ, సత్యాన్నీ చూస్తున్నాం కాబట్టి.

ఈ 'శివుడు' కథ మనది. నిజమైంది. వాస్తవమైంది. ఖచ్చితంగా సత్యమైంది. అందుకే ఇది నాకు నచ్చిన నా కథ.)

'ఆంధ్రభూమి' వారపత్రిక, 04.05.84

14.08.1985 సంచిలో 'నాకు నచ్చినా నా కథ'గా ప్రచురణ